
సాక్షి కర్నూలు

సోమవారం । 10 । మార్చి । 2025



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు ఆదివారం ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.



మల్లన్నకు నృత్యనీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై ఆదివారం జనగాంకు చెందిన చంద్రకళా నిలయం కళాకారులు శైవగీతాలకు సంప్రదాయ నృత్యం చేసి అలరించారు.

ఉష్ణోగ్రతలు

కనిష్టం	22.7
గరిష్టం	39.5

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:32	ఉ॥ 5:08
ఆదోని	సా॥ 6:31	ఉ॥ 5:08
నంద్యాల	సా॥ 6:29	ఉ॥ 5:07
ఆత్మకూరు	సా॥ 6:28	ఉ॥ 5:02
బనగానపల్లె	సా॥ 6:31	ఉ॥ 5:04

హదీస్ వెలుగు :

మొరపెట్టుకునే వారు ఉన్నారా? వేడుకునే వారు ఉన్నారా? వారి మొర విని తీరుస్తాను అని అల్లాహ్ రంజాన్‌లో ప్రతిరోజూ మూడు సార్లు అడుగుతాడు. తరచూ అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండండి. – పవిత్ర ఖురాన్

నిషాచరులు హల్‌చల్



- జైలుకు పంపుతున్నా జంకని వాహనచోదకులు
- జిల్లాలో పెరుగుతున్న డ్రంకెన్ డ్రైవ్ కేసులు
- నెల వ్యవధిలో 2,998 కేసులు నమోదు
- పట్టుబడుతున్న వారిలో యువతే అధికం

కర్నూలు: ''మద్యం తాగి వాహనం నడపొద్దు.. కుటుంబ సభ్యుల గురించి ఆలోచించండి'' అంటూ పోలీసులు అవగాహన చేస్తున్నా మందుబాబులకు తలకెక్కడం లేదు. పోలీసులు చెబుతున్న విషయాలను పెడచెవిన పెడుతున్నారు. కేసులు పెడుతున్నా మద్యం తాగి వాహనాలతో రోడ్డు పైకి వచ్చి హల్'చల్' చేస్తున్నారు.

ముమ్మర తనిఖీలు.. కఠిన చర్యలు

రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పోలీసు శాఖ జిల్లా వ్యాప్తంగా డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు ముమ్మరం చేసింది. ద్విచక్ర వాహనదారులే కాకుండా సరుకు రవాణా చేసే లారీలు, భారీ వాహనాలను నిలిపి తనిఖీ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అవసరమైతే కోర్టుకు పంపి జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తప్పవపని చెబుతూనే మరోవైపు విస్తృత అవగాహన కార్యక్రమాలను పోలీసులు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ కేసులు భారీగా నమోదవుతున్నా మందుబాబుల్లో మార్పు రావడం లేదు. పూటుగా తాగి వాహనాలు నడుపుతూ రహదారులపైకి వస్తున్నారు.

బ్రీత్ ఎనలైజర్‌తో శ్వాస పరీక్షలు

జిల్లా వ్యాప్తంగా పోలీసులు తనిఖీలు నిర్వహించి బ్రీత్ ఎనలైజర్ యంత్రాలతో శ్వాస పరీక్షలు జరుపుతున్నారు. దీంతో రక్తంలోని ఆల్కహాల్ స్థాయి నిర్ధారణ అవుతుంది. వీటి ప్రకారం కేసు నమోదు చేస్తారు. స్థాయి తీవ్రత ఆధారంగా కేసు విచారణ సమయంలో న్యాయస్థానాలు జరిమానాలు, శిక్షలు విధిస్తున్నాయి. డ్రంకెన్ డ్రైవ్‌లో అత్యధికంగా యువతే పట్టుబడుతున్నారు. విందు వినోదాల పేరుతో ఏదో ఒక కారణాన్ని సాకుగా తీసుకుని విచ్చలవిడిగా మద్యం తాగుతున్నారు. పోలీసుల లెక్కల ప్రకారం మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడుతున్న వారిలో 20 నుంచి 35 సంవత్సరాల వయస్సు వారే అత్యధికంగా ఉన్నారు.

గత నెలలో నమోదైన డ్రంకెన్ డ్రైవ్ కేసులు 1,022
జరిమానా రూ.30.66 లక్షలు
ఓపెన్ డ్రింకింగ్ కేసులు 1,976
జరిమానా రూ.19.76 లక్షలు



బ్రీత్ ఎనలైజర్ పరికరంతో డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నెల రోజుల వ్యవధిలో 2,998 కేసుల నమోదు

డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో అధిక శాతం ద్విచక్ర వాహనదారులే ఉంటున్నారు. నెల రోజుల వ్యవధిలో కేసులు నమోదు చేసినవారిలో 75 శాతం వీరే ఉన్నట్లు నమోదైన కేసులను బట్టి తెలుస్తోంది. గత నెల (ఫిబ్రవరి)లో 1,022 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, 1,976 బహిరంగ మద్యపానం (ఓపెన్ డ్రింకింగ్) కేసులు నమోదయ్యాయి. ఇందుకు గాను రూ.50.42 లక్షలు జరిమానా రూపంలో మందుబాబులు చెల్లించారు.

చట్టరీత్యా నేరం



మద్యం తాగి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరం. ప్రమాదానికి గురైతే కుటుంబీకులు ఇబ్బంది పడతారనే విషయాన్ని విస్మరించవద్దు. ప్రధానంగా యువత మద్యం మత్తులో వాహనాలు నడపటం ప్రమాదాలకు గురి కావడం ఆందోళనకరం. వారి విలువైన భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచిస్తున్నాం. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నాం. తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి తనిఖీ అధికారులు వాహనం స్వాధీనం చేసుకుంటారు.

– విక్రాంత్ పాటిల్, ఎస్పీ

శేష శైలావాసా.. అహోబిలేశా!

- వైభవోపేతం అహోబిలేశుడి బ్రహ్మోత్సవం

ఆళ్లగడ్డ: ప్రహ్లాదవరదుడు చిన్ని కృష్ణుడయ్యాడు. ఆదిశేషుని వాహనంగా చేసుకుని నవనీత కృష్ణావతారంలో మాడ వీధుల్లో ఉభయ దేవేరులతో కలసి విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. నెమలి పింఛం, పిల్లనగ్రోవితో కృష్ణుడి రూపంలో భక్తులను మంత్రముగ్ధులను చేశారు. అహోబిలంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు దిగువ అహోబిలంలో ఆదివారం ఉదయం ఉత్సవమూర్తులైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదుడిని యాగశాలలో కొలువుంచి పట్టు వస్త్రాలతో అలంకరించి కొలువుంచారు. అనంతరం వివిధ స్వర్ణాభరణాలు ధరించిన ప్రహ్లాదవరదుడు విశేషంగా ముస్తాబైన ఉభయ దేవేరులతో తొమ్మిది తలల శేషవాహనం అధిష్టించి మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులను యాగశాలలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి తిరుమంజనం నిర్వహించి అద్దాల మండపంలో కొలువుంచారు. రాత్రి శ్రీ ప్రహ్లాదవరదస్వామి చంద్రప్రభ వాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు.



శేషవాహనంపై కొలువైన ఉత్సవమూర్తులు

ఎగువ అహోబిలంలో..

జ్వాలా నరసింహస్వామి ఆదివారం శరభ వాహనాన్ని అధిష్టించి భక్తులను అనుగ్రహించారు. ఉత్సవ మూర్తులైన జ్వాలా నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి వారు శరభ వాహనంపై కొలువు కాగా గ్రామోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఎగువ అహోబిలంలో పొన్నుచెట్టువాహన సేవ, దిగువ అహోబిలంలో మోహిని అలంకారం, రాత్రి శరభ వాహన సేవలు ఉంటాయి.



11 గ్రామాల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

కమనీయం.. పట్ట దేవర ఉత్సవం

నెరణికి గ్రామంలో ఆదివారం నెణికిలింగేశ్వరస్వామి పట్ట దేవర (పట్టాభిషేక) ఉత్సవాలు కనుల పండువగా సాగాయి. గ్రామంలో వెలిసిన నెణికిలింగేశ్వర, భీరలింగేశ్వర స్వామితో కలిపి మొత్తం 11 గ్రామాలకు చెందిన ఉత్సవ విగ్రహాలను అత్యంత వైభవంగా ఊరేగించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. – హొళగుంద

న్యూస్‌రీల్

టీబీ డ్యాంలో 25.5 టీఎంసీలు



టీబీ డ్యాంలో నిల్వ ఉన్న నీరు

హొళగుంద: కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ప్రజలకు సాగు, తాగునీరునందిస్తూ వరదాయినిగా ఉన్న తుంగభద్ర జలాశయంలో ఆదివారం 25.547 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో జీరో క్యూసెక్కులు కాగా.. 10,041 కూసెక్కుల నీటిని వివిధ కాల్వకు వదులుతున్నారు. ఎల్లెల్సీకి మార్చి నెలాఖరు వరకు నీటిని విడుదల చేస్తామని టీబీ బోర్డు అధికారులు ఇప్పటికే ప్రకటించారు. అయితే డ్యాంలో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉండటంతో ఏప్రిల్ 15 వరకు కొనసాగే అవకాశం ఉంది.

సీసీఐ కేంద్రాలపై విజి'లెన్స్'



దూదిబేళ్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్పీ

ఆదోని అర్బన్: పట్టణంలోని సీసీఐ కేంద్రాల్లో శనివారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎన్‌డీబీఎల్, ధారశ్రీ పరిశ్రమల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో దూదిబేళ్లను, జిన్నింగ్ నడిచే విధానాన్ని, రికార్డులను కర్నూలు విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి, ఏఓ విశ్వనాథ్ తనిఖీ చేశారు. స్థానిక సీసీఐ అధికారి భరత్‌ను, మార్కెట్‌యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డిలను వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలు ఉన్న ప్రజలు అర్జీలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

నదుల పూడ్చివేతను ఆపాలి



నదిలో పూడ్చిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): నగరంలోని హంద్రీ, తుంగభద్ర నదుల పూడ్చివేతను అధికారులు ఆపాలని తుంగభద్ర, హంద్రీ, కేసీ కెనాల్ పరిరక్షణ కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం వారు నదుల్లో పూడ్చిన ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ కమిటీ కన్వీనర్ బస్తిపాటి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. నదులను పూడ్చి రోడ్ల విస్తరణ, నగర సుందరీకరణ పనులు చేపట్టడం భావ్యం కాదన్నారు. ఇటీవల తుంగభద్ర, హంద్రీ నదుల్లో పలు చోట్ల మట్టితో నింపేయడం సరికాదన్నారు. నదుల పరిరక్షణకు పాటు పడాల్సిన అధికారులు దగ్గరుండి మరీ పనులు చేయించడం దారుణమన్నారు. సీపీఐ నాయకులు రామకృష్ణారెడ్డి, మనోహర మాణిక్యం, సుంకన్న, యోహోను, రాయలసీమ విద్యా వంతుల వేదిక కో కన్వీనర్ రత్నం ఏసేపు, జనవిజ్ఞానవేదిక బాధ్యు లు మాన్సూర్ బాషా, నాగరాజు, అనిల్ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు ఉచితంగా ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించనున్నట్లు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.సుధారాణి తెలిపారు. ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు జరుగనున్న పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు బస్సుల్లో హాల్ టికెట్ చూపితే ఉచితంగా ప్రయాణం చేయవచ్చునన్నారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో నివాస ప్రాంతం నుంచి పరీక్ష కేంద్రాలకు, పరీక్ష కేంద్రాల నుంచి నివాసానికి చేరుకునేందుకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్దేశించిన సమయానికి కేంద్రాలకు చేరుకునేందుకు పరీక్ష సమయంలో మాత్రమే బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. ఒక వేళ ఏ కారణం చేతనైన పరీక్షను రద్దు చేస్తే పరీక్ష నిర్వహించిన రోజు సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు.

చేనేత కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న చేనేత కార్మికులు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్ ఎదుట ఆదివారం చేనేత కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. చేతి వృత్తిదారుల సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. అంతకుముందు సీపీఐ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు మాట్లాడుతూ.. తెలంగాణలో మాదిరిగా ఏపీలోనూ కులగణన చేపట్టాలన్నారు. చేతి వృత్తిదారుల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరారు. చేనేత కుటుంబాలను ఆదుకుంటామని చెప్పి సీఎం చంద్రబాబు నాయుడు మోసం చేశారని విమర్శించారు. ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు రామచంద్రయ్య, కన్నయ్య, లక్ష్మీ, కట్ట హేమసుందరావు, పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బాబూ.. జాబ్ క్యాలెండర్ ఏదీ?



యువత పోరు కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్టీ నేతలు

- విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిన కూటమి సర్కార్
- ఫీజు బకాయిలపై 12న 'యువత పోరు'
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగభృతి హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విస్మరించారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 12న చేపట్టే యువత పోరు కార్యక్రమ పోస్టర్లను పార్టీ నేతలతో కలసి ఎస్వీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో విద్యారంగానికి పెద్దపీట వేశారన్నారు. అమ్మఒడి, నాడు–నేడు, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను పెండింగ్‌లో ఉంచి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగ యవతకు ప్రతి నెల రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు మొహం చాటేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలనే డిమాండ్‌తో కర్నూలులో నిర్వహించే 'యువత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నగరంలోని స్థానిక ధర్నా చౌక్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ వరకు వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు.

- వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ కూటమి సర్కార్ అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులు లేరని అబద్ధాలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమ్మ మట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను బుట్టదాఖలు చేసిందన్నారు. చంద్రబాబు హామీలు నమ్మి ఓట్లు వేసిన పేదలకు మోసపోయినట్లు అర్థమైందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గడ్డం రామక్రిష్ణ, యువజన విభాగం అధ్యక్షుడు శివారెడ్డి, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి పోగు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యమిత్రలకు దినదిన గండం

- ఆరోగ్యశ్రీ స్థానంలో బీమా తెస్తున్న ప్రభుత్వం
- త్వరలో నూతన ఆరోగ్య పాలసీ అమలుకు శ్రీకారం
- అగమ్యగోచరంగా ఉద్యోగుల భవిష్యత్తు
- ఉమ్మడి జిల్లాలో 165 మంది ఉద్యోగులు
- సమ్మె యోచనలో వైద్యమిత్రలు

కర్నూలు(హాస్పిటల్): కూటమి ప్రభుత్వం చిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోంది. తాజాగా ఆరోగ్యశ్రీ పరిధిలో పని చేసే వైద్యమిత్రలు, ఉద్యోగ భద్రత లేక ఆందోళన చెందుతున్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) స్థానంలో బీమాను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. దీంతో అందులో పనిచేసే ఉద్యోగులకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. ఎంత మంది ఉంటారో, ఎంత మంది రోడ్డున పడతారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో వారు సమ్మెకు సిద్ధమవుతున్నారు. కర్నూలు జిల్లాలో మొత్తం 6,49,333 ఎన్టీఆర్ వైద్యసేవ కార్డులు ఉన్నాయి. నెట్‌వర్క్ ఆసుపత్రులు 128 ఉన్నాయి. ఇందులో 5 ప్రభుత్వ ఆసుపత్రులు, ఒక ఏరియా ఆసుపత్రి, ఐదు సీహెచ్‌సీలు, 58 ప్రైవేటు హాస్పిటళ్లు, 34 పీహెచ్‌సీలు, 25 డెంటల్ హాస్పిటళ్లు ఉన్నాయి. 98 మంది వైద్యమిత్రలు పనిచేస్తున్నారు. అలాగే నంద్యాల జిల్లాలో మొత్తం 5,36,887 ఎన్టీఆర్ వైద్యసేవ కార్డులున్నాయి. జిల్లాలో మొత్తం 101 నెట్‌వర్క్ హాస్పిటళ్లు కొనసాగుతున్నాయి. ఇందులో 65 ప్రభుత్వ ఆసుపత్రులు, 24 ప్రైవేటు ఆసుపత్రులు, 12 డెంటల్ హాస్పిటళ్లు ఉన్నాయి. జిల్లా మొత్తంగా 67 మంది ఆరోగ్యమిత్రలు పనిచేస్తున్నారు. గత 17 ఏళ్లుగా ఇందులో చాలా మంది ఉద్యోగులు ట్రస్టును నమ్ముకుని పనిచేస్తున్నారు. అయితే ప్రభుత్వం మారినప్పుడల్లా వైద్యమిత్రలకు దినదినగండం నూరేళ్ల ఆయుష్షులా తయారైంది. నాడు వైఎస్ఆర్, గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో వారు గుండెలపై చేయివేసుకుని ఉద్యోగాలు చేసుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని తీసివేసి ఆరోగ్యబీమాను తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఈ మేరకు ఉన్నతాధికారులతో, నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చలు జరిపింది. ఓ బీమా కంపెనీతో సైతం ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు సైతం చకచకా జరిగిపోతున్నాయి. అన్నీ సమకూరితే ఏప్రిల్ నుంచే ఈ నూతన ఆరోగ్య పాలసీని రాష్ట్రంలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.



వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్‌రెడ్డికి సమ్మె నోటీసు ఇస్తున్న వైద్యమిత్రలు, ఉద్యోగులు



ఎన్టీఆర్ వైద్యసేవ కియోస్క్

సమ్మెకు సిద్ధమైన వైద్యమిత్రలు

డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు వారి ప్రధాన సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈ నెల 10, 17, 24వ తేదీల్లో (మూడు సోమవారాలు) విధులు బహిష్కరించేందుకు నోటీసులు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తోంది. మరోవైపు ఆప్కాస్ రద్దు దిశగా ఇప్పటికే అడుగులు వేసిన ప్రభుత్వం ఏప్రిల్ నుంచి బీమా సేవలు కొనసాగేలా చర్యలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో వైద్యమిత్రలు ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. కాగా స్పందించిన ప్రభుత్వం సమ్మెను అడ్డుకునేందుకు చర్చల పేరుతో ఒక అడుగు ముందుకు వేసింది. ఈ మేరకు 10వ తేదీన నిర్వహించే విధుల బహిష్కరణ కార్యక్రమాన్ని ఉద్యోగులు వాయిదా వేసుకున్నారు.

వైద్యమిత్రలు ఆందోళన చెందుతున్నారు



వైద్యమిత్రలో జరుగుతున్న పరిమాణాలతో వైద్యమిత్రలు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో గత 17 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రజలకు ఉచిత సేవలందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న వైద్యమిత్రలు(ఆరోగ్యమిత్రలు), ఉద్యోగులు ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధిపొందలేక పోతున్నారు. కనీస వేతనాలు అమలు చేయకుండా అరకొర జీతాలతో పనిచేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, పథకాల రూపురేఖలు మారుతున్నా ఉద్యోగుల తలరాతలు మారడం లేదు.

–కె.దేవేంద్రనాయక్, స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ, ఏపీ వైద్యసేవ ఎంప్లాయిస్ జేఏసీ

కుటుంబ పోషణ భారమైంది



చాలీచాలని జీతాలతో వైద్యమిత్రలు విధులు నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా కుటుంబపోషణ భారమై తమ పిల్లల భవిష్యత్ ఏమిటని విసుగెత్తిపోయారు. మరోవైపు ఎన్టీఆర్ వైద్యసేవ స్థానంలో బీమా సేవలు తీసుకువస్తున్నారు. ఇలాంటి సమయంలో అందులో పనిచేస్తున్న వైద్యమిత్రలు, ఉద్యోగుల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. అందుకే మూడు సోమవారాలు విధులు బహిష్కరించి వైద్యసేవ డీసీ కార్యాలయం వద్ద నిరసన తెలపాలని నిర్ణయించుకున్నాం.

–సి. కంబగిరి, జిల్లా అధ్యక్షులు, ఏపీ వైద్యసేవ ఎంప్లాయిస్ యూనియన్, కర్నూలు

నిఘా నీడలో పనిచేయలేకపోతున్నాం



సీసీ కెమెరాల నిర్వహణతో, విసిగించే యాప్‌లతో సంబంధంలేని గ్రీవెన్స్‌లతో విసిగిపోయిన ఉద్యోగులు పంటి కింద బాధలను అనుభవిస్తూ ప్రజల సంక్షేమం కోసం చిరునవ్వుతో విధులు నిర్వహిస్తున్నారు. 17 ఏళ్ల సర్వీసుకు ఇంత వరకు క్యాడర్ గుర్తింపులేదు. కనీసం వేతనం, ఉద్యోగ భద్రతలేదు. ఉద్యోగి చనిపోతే సాధారణ వ్యక్తికి ఇచ్చే ఎక్స్‌గ్రేషియాతో సరిపెట్టేస్తున్నారు. ఉద్యోగి రిటైర్ అయితే గ్రాట్యుటీ లేకుండా నిర్దాక్షిణ్యంగా ఇంటికి పంపిస్తున్నారు.

– జి.రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు, ఏపీ వైద్యసేవ ఎంప్లాయిస్ యూనియన్, కర్నూలు

క్లుప్తంగా

మాజీ సైనికుడి మృతి


ప్రేమ్‌కుమార్, మాజీ సైనికుడు

కర్నూలు(అగ్రికల్చర్): నగర శివారులో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు ప్రేమ్‌కుమార్(45) అనారోగ్య కారణాలతో ఆదివారం మరణించారు. ఈయన భారత సైన్యంలో ఎంఈజీ 22 ఏళ్లు సర్వీస్ పూర్తి చేసి హవల్దారుగా పదవీ విరమణ తీసుకున్నారు. నగర శివారులోని వెంకాయపల్లి ఎల్లమ్మ దేవస్థానం ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మరణించడంతో పలువురు మాజీ సైనికులు సంతాపం ప్రకటించారు. మృతుడి స్వగ్రామమైన ఆళ్లగడ్డలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. సైన్యంలో విశేషంగా సేవలు అందించిన ప్రేమ్‌కుమార్ మృతి బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు నర్రా పేరయ్య చౌదరి ఆదివారం ఓ ప్రకటనలో తన సంతాపం తెలిపారు.

బైక్ అదుపు తప్పి..

- కానాలా గ్రామ వాసి మృతి



ఉయ్యాలవాడ: మాయలూరు- కానాల ఆర్ అండ్‌బీ రహదారిలో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి అదుపు తప్పి కింద పడి మృతి చెందాడు. ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు... సంజామల మండలం కానాల గ్రామానికి చెందిన కమలాకర్ (45) పనిమీద గోవిందపల్లె గ్రామానికి వెళ్లాడు. తర్వాత తిరిగి తన స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. మార్గ మధ్యంలో మాయలూరు- కానాల ఆర్‌అండ్‌బీ రోడ్డులో రైల్వే ట్రాక్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనున్న గుంతలో పడింది. ఈఘటనలో కమలాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శోభ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..


కురువ ఈరన్న (ఫైల్)

గోనెగండ్ల: గుర్తు తెలియని వాహనం ఢీకొని మండల పరిధిలోని ఒంటెడుదిన్నె గ్రామానికి చెందిన కురువ ఈరన్న (30) అనే యువకుడు మృతిచెందాడు. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు.. కురువ చిన్న ఉరుకుందు, గంగమ్మ కుమారుడు అయిన ఈరన్న శనివారం రాత్రి గోనెగండ్ల నుంచి స్వగ్రామానికి నడుచుకుంటూ వెలుతున్నాడు. అయితే, గాజులదిన్నె ప్రాజెక్టు స్టేజ్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. ఈ ఘటనలో ఈరన్న తలకు తీవ్రగాయం కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతిడి అక్క కురువ నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బియ్యం పట్టివేత

నందికొట్కూరు: పట్టణంలోని సంగయ్యపేటలో పగడం పక్కీరయ్య అనే వ్యాపారి ఇంటి ముందు 37 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి బియ్యాన్ని స్టేషన్‌కు తరలించినట్లు టౌన్ ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎవరైనా పీడీఎస్ బియ్యం విక్రయించినా, అక్రమంగా నిల్వ చేసినా చట్ట పరమైన చర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

క'న్నీటి' కష్టాలు

- జొహరాపురం గ్రామానికి ఒక్కిరేణినీరే దిక్కు
- పిల్లల నుంచి పెద్దల వరకు తప్పని అవస్థలు
- పిలిచినా ఊరికి రాని బంధువులు


నీటి కోసం ఒక్కిరేణి వద్దకు వచ్చిన గ్రామస్తులు


ఒక్కిరేణిలో నీరు తీసుకెళ్తున్న గ్రామస్తులు


సైకిల్‌పై బిందెలతో నీళ్లు తీసుకెళ్తున్న అమ్మకు సహాయ పడుతున్న పిల్లలు


ట్యాంకర్లతో నీటిని అమ్మకానికి తీసుకెళ్తున్న డ్రైవర్లు

ఆస్పరి: ఎండలు మండుతూ దాహం వేసినా చుక్క నీరు తాగలేని దుస్థితి వారిది. మంచినీరు కావాలంటే దూరం వెళ్లాలి. అక్కడ వేల మంది జనం.. చాలా కష్టం పడితేనే బిందె నీరు దొరుకుతుంది. ఇంట్లో ఉండే మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులను తమతోపాటు తప్పని తీసుకెళ్లాల్సిన దుస్థితి. ఆస్పరి మండలంలోని జొహరాపురం ప్ర'జల' కష్టాలు ఇవీ.. గ్రామంలో 1,200 ఇళ్లు ఉండగా 7,000 మంది నివాసం ఉంటున్నారు. యాభై ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం జొహరాపురానికి 50 కిలో మీటర్లు దూరంలో ఉన్న బాపురం రిజర్వాయర్ నుంచి మంచి నీటి సరఫరా చేసేందుకు పైపులైన్ వేసింది. అయితే పై గ్రామాలైన ఆలూరు, మొలగలవల్లి, కొట్టాల గ్రామాల వారు నీటి అవసరాలు తీర్చుకున్న తరువాతే జొహరాపురం గ్రామానికి బాపురం రిజర్వాయర్ నీరు వస్తుంది. అది కూడా ప్రతి ఒక్క కాలనీకి నీటిని సరఫరా చేయరు. దీంతో ప్రజలు తప్పని పరిస్థితుల్లో గ్రామ సమీపంలో కలుషితంగా ఉన్న ఒక్కిరేణి నీటితోనే దాహం తీర్చుకుంటున్నారు. కొందరు జ్వరం, విరేచనాలు, నొప్పులు ఎక్కువై అస్పత్రుల పాలవుతున్నారు. ఒక్కిరేణిలో నీరు లేకపోతే ఆలూరు, ఆస్పరి నుంచి వచ్చే మినిరల్ వాటర్‌ను కొనుగోలు చేయాల్సి వస్తోంది.

ఎక్కడ బోరు వేసినా ఫ్లోరైడ్ నీరే!

వేసవి వచ్చిందంటే జొహరాపురంలో చదువుకునే పిల్లలు నుంచి వయో వృద్ధు లు వరకు నీటి కోసం వెళ్లాల్సిందే.ఈ గ్రామ పరిసరాలు మొత్తం నల్లరేగడి భూములున్నాయి. దీంతో ఎక్కడ బోరు వేసినా ఫ్లోరైడ్ నీరే పడుతోంది. బోర్లు, రిజర్వాయర్లు లేని కాలంలో దాహం తీర్చుకునేందుకు వందల ఏళ్ల క్రితం పెద్దలు వర్షపు నీరు వెళ్లే ప్రధాన కాలువ సమీపంలో ఒక్కిరేణి నిర్మించుకున్నారు. అప్పటి నుంచి ఒక్కిరేణి నీటినే గ్రామస్తులు తాగుతున్నారంటే పరిస్థితి ఎంత దారణంగా ఉందో అర్థమవుతోంది. గ్రామంలో మంచి నీటి సమస్య ఉండటంతో దాదాపు వంద కుటుంబాలు భూములను కౌలుకిచ్చి కర్నూలు, బళ్లారి, ఆదోని పట్టణాలకు వెళ్లి స్థిర పడ్డారు. ఇంకా చాలా మంది వెళ్లే ఆలోచనలో ఉన్నారని గ్రామస్తులు చెబుతున్నారు.

ప్రతి ఇంటికీ సంపు

గ్రామంలో కొత్తగా నిర్మించుకునే ప్రతి ఇంటికి సంపు ఏర్పాటు చేసుకుంటున్నారు. మిద్దె పై నుంచి వచ్చే నీటిని పైపులు ద్వారా సంపును నింపుకుంటున్నారు. కొత్తగా ఇల్లు నిర్మించుకోవాలన్నా నీరు దొరక ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్క ట్యాంకర్ నీరు రూ.800 కొనుగోలు చేస్తున్నారు. ఇది అదనపు ఖర్చు అని బాధపడుతున్నారు. నీటి సమస్య ఉండడంతో గ్రామంలో శుభ కార్యాలు కూడా చేయక పట్టణాలలోని ఫంక్షన్ హాల్‌లో చేసుకుంటున్నారు.

సమస్య తీవ్రంగా ఉంది



మా గ్రామంలో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉంది. ఒక్కిరేణిలో ఉన్న కలుషిత నీరు తాగుతుండడంతో పెద్ద పండగలైన దసరా, ఉగాది, గౌరమ్మ పండుగలకు బంధువులను పిలిచినా రావడం లేదు. ఎక్కడా కలుషిత నీరు తాగి అనారోగ్యం పాలవుతామనే భయం ఉంది. – కరుణాకర్

రోగాలు వస్తున్నాయి



బాపురం రిజర్వాయర్ ను ంచి 15, 20 రోజులకో సారి నీరు వస్తోంది. పెద్ద ల కాలంలో తవ్వించిన ఒక్కిరేణి రక్షణ గోడలు పడిపోవడంతో పశువులు, కుక్కలు నీరు తాగి పోతున్నాయి. కలుషిత నీటితే తాగుతుండటంతో రోగాలు వస్తున్నాయి. మమ్మల్ని అధికారులు పట్టించుకోవడం లేదు. – రామాంజినేయులు

రిజర్వాయర్ నిర్మించాలి



మా గ్రామానికి ఐదు కిలో మీటర్లు దూరంలో హంద్రీ నీవా కాలువ ఉంది. ఆ కాలువ నీటిని మళ్లించి జొహరాపురం సమీపంలో రిజర్వాయర్ నిర్మిస్తే ఆస్పరి, చిన్నహోతూరు, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, హలిగేర గ్రామాలకు కూడా మంచి నీటిని సరఫరా చేయవచ్చు. – లక్ష్మన్న

అధికారులు పర్యటించాలి



మా గ్రామంలో జిల్లా అధికారుల ఒక్కసారి పర్యటిస్తే సమస్య ఏమిటో తెలుస్తుంది. తరతరాలు గా మేం ఒక్కిరేణి నీటినే తాగుతున్నాం. ప్రస్తుతం ఒక్కిరేణిలో ఉన్న నీరు ఒక నెల మాత్రమే సరిపోతుంది. తరవాత బిందెడు మంచి నీళ్ల కోసం పక్క గ్రామాలైన ఆస్పరి, దేవనబండకు వెళ్లాలి. – బంగారు సంజప్ప

శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకుల ఆందోళన


ఆసుపత్రిలో ఆందోళన చేస్తున్న శిశువు కుటుంబీకులు, బంధువులు

ఎమ్మిగనూరు రూరల్: తమ శిశువు మృతికి ప్రభుత్వాసుపత్రి వైద్యులే కారణమని కుటుంబీకులు వైద్యులతో వాగ్వాదానికి దిగారు. వివరాల్లోకి వెళితే... గోనెగండ్లకు చెందిన నరసింహులు భార్య సువార్తమ్మ మొదటి కాన్పుకోసం తన పుటినిల్లు ఎమ్మిగనూరులోని టీచర్స్ కాలనీకి వెళ్లింది. ఆదివారం ఉదయం హఠాత్తుగా నొప్పులు రావటంతో ఆమెను తండ్రి తిమ్మప్ప ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు చేసి సాధారణ కాన్పు చేశారు. అయితే, బిడ్డ రెండు పేగులు మెడకు చుట్టుకొని పుట్టడంతో ఊపిరి ఆడని పరిస్థితి. వెంటనే ఆ శిశువును కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సువార్తమ్మ కుటుంబ సభ్యులకు సూచించగా వారు స్థానిక ఓ ప్రైవేట్ నర్సింగ్‌హోంకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే శిశువు మృతి చెందిందని చెప్పటంతో కుటుంబీకులు, బంధువులు ప్రభుత్వాసుపత్రికి చేరుకొని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న టౌన్ ఏఎస్‌ఐ కిష్టప్ప, పోలీస్ సిబ్బంది ప్రభుత్వాసుపత్రికి చేరుకుని ఆందోళనకారులను సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. వైద్యుల నిర్లక్ష్యమే తమ బిడ్డ మృతికి కారణమని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే ఈ ఘటనపై డ్యూటీ డాక్టర్ సమీరా మాట్లాడుతూ బేబి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని కర్నూలుకు తీసుకెళ్లాలని తాము ముందే సమాచారం ఇచ్చామని చెప్పారు.

భార్య పుట్టింటికి వెళ్లి రాలేదని..

ఓర్వకల్లు: భార్య పుట్టింటికి కాన్పు కోసం వెళ్లి తిరిగి రాకపోవడంతో తీవ్ర మనస్థానానికి గురై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈసంఘటన మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చిన్న స్వాములు చిన్న కుమారుడు రవితేజ (25) స్థానిక వసుదేవరెడ్డి అనే వ్యక్తి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తాడు. మూడేళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. రెండో కాన్పు కోసం భార్య కొన్ని నెలల క్రితం పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు.ఈ విషయంలో తీవ్రమనస్థాపానికి గురైన రవితేజ శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవ్వరులేని సమయంలో ఇనుప కొక్కికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారం అందజేయడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి ఉరినుంచి బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపారు.

రాయలసీమ రవాణాశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా లక్ష్మీకర్‌రెడ్డి


పెద్దిరెడ్డి లక్ష్మీకర్‌రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రవాణాశాఖలో రాయలసీమ స్థాయిలో నాన్ టెక్నికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీటీడీ ఎన్‌టీఈఏ)కు సంబంధించి సీమ అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి లక్ష్మీకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఎన్నికకు సంబంధించి ఫిబ్రవరి 22న నోటిఫికేషన్, 9న నామినేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల అధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కడపలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన ఎన్నిక కార్యక్రమంలో అధ్యక్షుడిగా లక్ష్మీకర్‌రెడ్డి, జోన్ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఈవై ప్రకాశ్ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్,కడప), జోన్ వైస్ ప్రెసిడెంట్–1గా కె.సువర్ణకుమారి (అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, అనంతపురం), జోన్ వైస్ ప్రెసిడెంట్–2గా టీఎస్ పురుషోత్తంరెడ్డి (సీనియర్ అసిస్టెంట్, చిత్తూరు), జోన్ వైస్‌ప్రెసిడెంట్–3గా ఎస్.మనోహర్‌బాబు (జూనియర్ అసిస్టెంట్, ఆదోని), జోన్‌సెక్రటరీగా టి.వి జయ్‌కుమార్ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, మదనపల్లె), జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఓ.యువ కిశోర్ (సీనియర్ అసిస్టెంట్, తిరుపతి), జోన్ జాయింట్ సెక్రటరీ–1గా డి.నసీరుద్దీన్ (సీనియర్ అసిస్టెంట్, కర్నూలు), జోన్ జాయింట్ సెక్రటరీ–2 ఓ.నాగరాజ (సీనియర్ అసిస్టెంట్, మదనపల్లె), జోన్ జాయింట్ సెక్రటరీ–3 పి.చక్రపాణి (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, చిత్తూరు), జోన్ ట్రెజరర్‌గా ఎన్.రవిప్రకాశ్ (సీనియర్ అసిస్టెంట్, హిందూపురం)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన 11 మందిని పలువురు రవాణాశాఖలో పనిచేసే ఉద్యోగులు, టెక్నికల్ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

బరితెగించిన టీడీపీ శ్రేణులు

- దౌర్జన్యంగా మహిళలపై దాడి
- నలుగురికి గాయాలు


గాయపడిన మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కొలిమిగుండ్ల: టీడీపీ నాయకులు బరితెగిస్తున్నారు. అక్రమాలు, అన్యాయాలను ప్రశ్నించిన వారిపై దాడులు, దౌర్జన్యాలకు తెగబడుతున్నారు. తాజాగా ఓ భూమి విషయంలో కొలిమిగుండ్ల మండలం చింతలాయిపల్లెకు చెందిన నలుగురిపై దాడి చేసి గాయపరిచారు. వివరాల్లోకి వెళితే.. చింతలాయిపల్లెలోని 144/1 సర్వే నెంబర్‌లో 9.72 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి విషయంలో దూదేకుల రహంతుల్లా, అంకిరెడ్డిపల్లెకు చెందిన బత్తుల లక్ష్మన్న మధ్య చాలా రోజుల నుంచి వివాదముంది. దీనిపై కోర్టులో వ్యాజ్యం జరుగుతుంది. రహంతుల్లా సోదరులు ఆ భూమిలో చీని చెట్లు నాటుకున్నారు. ఫిబ్రవరి 28న అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి కొలతలు వేసి మూడు ఎకరాల భూమిని లక్ష్మన్నకు అప్పగించారు. జేసీబీ సాయంతో చింతలాయిపల్లెకు చేరుకున్న టీడీపీ శ్రేణులు దౌర్జన్యంగా చీని చెట్లను తొలగించడంతో రహంతుల్లా కుటుంబానికి చెందిన మహిళలు అడ్డుపడ్డారు. ఇందుకు రెచ్చిపోయిన అధికారపార్టీ నాయకులు లక్ష్మన్న, రంగనాయకులు, సుబ్బులుతో పాటు మరి కొంత మంది మహిళలు అని చూడకుండా అమీనాబీ, జైన్‌బీ, ఇమాంబీతో పాటు బాలిక హసినిపై కట్టెలు, రాళ్లతో ఇష్టానుసారంగా దాడి చేసి గాయపర్చారు. క్షతగాత్రులను కుటుంబ సభ్యులు బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి క్షతగాత్రులను పరామర్శించి ఘటనపై ఆరాతీశారు. చింతలాయిపల్లెలో కొద్ది రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ నేత నీలం సంజీవకుమార్‌రెడ్డికి చెందిన 400 మునగ చెట్లను పూర్తిగా నేలమట్టం చేశారు. ఆకేసులో నిందితులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మంత్రి అండతోనే దాడులు

బనగానపల్లె రూరల్: బీసీ జనార్దన్‌రెడ్డి మంత్రి అయిన తర్వాత నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల ఆగడాలకు హద్దు లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. మంత్రి అండతోనే ఆ పార్టీ నాయకులు చింతలాయిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడి చేశారన్నారు. ఆసుపత్రిలో బాధితులను పరామర్శించి ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి బీసీ ప్రోద్బలంతో కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాధితులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి కోర్టు వ్యాజ్యంలో ఉన్నటువంటి పొలాన్ని బత్తుల లక్ష్మన్న కుటుంబసభ్యులకు అప్పగించాలని ఒత్తిడికి గురిచేసినట్లు ఆరోపించారు. అంగీకరించకపోవడంతో చీని చెట్లను జేసీబీ సహాయంతో తొలగించడమే కాక దాడి చేశారన్నారు. కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు అన్ని విధాలుగా తాను అండగా ఉంటానన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాది అబ్దుల్‌ఖైర్ ఉన్నారు.

పంట మార్పిడి ఎంతో మేలు


మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణారావు

కర్నూలు(అగ్రికల్చర్): ఎప్పుడూ ఒకే పంట వేస్తుండటంతో చీడపీడల బెడద పెరుగుతుందని, విధిగా పంట మార్పిడి చేపట్టే విధంగా రైతులను ప్రోత్సహించాలని నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణారావు సూచించారు. కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో దేశీ డిప్లొమా కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు ఆదివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు వేసవి దుక్కుల ప్రాధాన్యతపై అవగాహన పెంచాలన్నారు. ఎకరానికి 5 నుంచి 10 వరకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విశ్రాంత జేడీఏ జయచంద్ర పలు సూచనలు చేశారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై గుర్తు తెలియని దుండగుల దాడి


ఆసుపత్రిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జశ్వంత్

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామ సమీపాన బేతంచెర్ల – నంద్యాల రహదారిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి గాయపరిచారు. ఆదివారం చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాల్లోకి వెళితే.. బేతంచెర్ల పట్టణానికి చెందిన చంద్ర కుమారుడు జశ్వంత్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు.ఈ యువకుడు ఆదివారం నంద్యాలకు వెళ్లి ద్విచక్ర వాహనం కొనుగోలు చేసుకొని బేతంచెర్లకు బయలు దేరాడు. సిమెంట్ నగర్ సమీపాన బేతంచెర్ల నుంచి నంద్యాల వైపు వెళ్తున్న కోళ్లఫారానికి సంబంధించిన బొలెరో వాహనం ఎదురొచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై నుంచి జశ్వంత్ కింద పడగానే బొలెరోలో ఉన్న గుర్తు తెలియని దుండగులు కిందకు దిగి రాళ్లు, రాడ్లుతో తలపై దాడి చేసి ఆ యువకుడి చేతికి ఉన్న నాలుగు తులాల బంగారు కడియం, రెండు రింగులను బలవంతంగా లాక్కున్నారు. తర్వాత ఆ యువకుడు ఆర్టీసీ బస్సు ఎక్కి బేతంచెర్లకు వెళ్లాడు. అక్కడ స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించుకొని విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపగా వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్‌ఐ రమేష్ బాబు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బంగారం కోసం దాడి చేశారా లేక మరేదైనా కారణం ఉందా అనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలనుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- ఇద్దరి పరిస్థితి విషమం


మృతిచెందిన సుధాకర్

ఆళ్లగడ్డ: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై ఆళ్లగడ్డ సమీపంలోని హైవే ధాబా సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మహానంది క్షేత్రానికి వెళ్లి దర్శనం చేసుకుని కారులో తిరిగి ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో ఆళ్లగడ్డ సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న బ్రిడ్జిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న సుధాకర్ (28) అక్కడికక్కడే మృతి చెందగా, వెంకటేశ్వర్లు, మనీష్‌కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న డీఎస్పీ ప్రమోద్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాల వైద్యశాలకు తరలించారు.

మూడు రోజుల వైద్య శిబిరం


వెల్దుర్తి సీహెచ్‌సీలో వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ

వెల్దుర్తి: చిన్నారులు అనారోగ్యం పాలయ్యారన్న సమాచారం తెలుసుకుని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి శాంతికళ, డీపీఓ భాస్కర్ ఆదివారం వెల్దుర్తి సీహెచ్‌సీ, రత్నపల్లె గ్రామాన్ని సందర్శించారు. చిన్నారులకు విషజ్వరాలు కావని తేల్చుకుని మూడు రోజుల పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీడీఓ డీఐఓ నాగప్రసాద్, సంచార వైద్య చికిత్స నోడల్ అధికారి రఘు, రామళ్లకోట పీహెచ్‌సీ వైద్యాధికారి భువనతేజ, రత్నపల్లె సర్పంచ్ ఫక్కీరమ్మ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న చెస్ సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో 17 సంవత్సరాల్లోపు బాలబాలికలకు జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభమయ్యాయి. నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్ పోటీలు ప్రారంభించి మాట్లాడారు. చెస్ క్రీడ ఏకాగ్రతను పెంచుతుందని, తద్వారా చదువులో కూడా రాణించడానికి వీలవుతుందన్నారు. పిల్లల చేతికి మొబైల్ ఫోన్‌లు ఇవ్వకుండా వారి దృష్టిని ఆటలపై మళ్లించాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, రామకృష్ణ డిగ్రీ కళాశాల డైరెక్టర్ ప్రగతిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఓర్వకల్లు: కర్నూలు–కడప జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గడివేముల మండలం ఒండుట్ల గ్రామానికి చెందిన తలారి రంగస్వామి కొడుకు రంగనాయకులు (50) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తాడు. ఈ క్రమంలో పొగాకు దిగుబడులను విక్రయించేందుకు మండలంలోని నన్నూరు సమీపాన గల డెక్కన్ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చారు. పంట నాణ్యత సరిగాలేదని కొనుగోలు దారులు పొగాకు బేళ్లను రీబేల్ చేయడంతో స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ట్రాక్టర్‌లో వేసుకొని తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలో రెడ్డి డాబా వద్ద ట్రాక్టర్ నిలబెట్టి డాబా వైపునకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా నంద్యాల నంచి కర్నూలు వైపు వెళుతున్న లారీ రంగనాయకులును ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న స్థానికులు హైవే పెట్రోలింగ్ వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుడి భార్య ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.



ముక్క.. మారిన మక్కువ

'బర్డ్‌ఫ్లూ' పూర్తిగా తగ్గిపోయినా మాంసం ప్రియులు చికెన్ కొనుగోలుకు ఇష్టం పడటం లేదు. ఖరీదైనా మటన్‌పైనమక్కువ చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడంతో చికెన్ షాపులు వెలవెల బోతున్నాయి. అధికారులు సైతం అవగాహన కల్పించడంలో విఫలం కావడంతో వ్యాపారులు నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తోంది. కర్నూలు నగరంలో రెవెన్యూ కాలనీలో ఆదివారం కనిపించిన దృశ్యమిది. మటన్ సెంటర్ వద్ద మాంసం ప్రియులు పోటెత్తగా చికెన్ కేంద్రం వద్ద కొనుగోళ్లు కనిపించలేదు. –సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు